# మనసులో మాటలు

## 1987-వ సంవత్సరపు హిందూ స్త్రీల వారసత్వపు చట్టం

● శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ●

హిందూస్త్రీలకు ఉపయోగకరమైన యే బిల్లువచ్చినా శాసనసభలలో నెగ్గడమే కష్టం. ప్రతి బిల్లుకు భిన్నాభిప్రాయాలు వెల్లడించే సభ్యులంతా స్త్రీల బిల్లనగానే యించుమించుగా యేకమౌతారు. యిక అది ఆస్తిహక్కులకు సంబంధించినది అయెనా ఏకగ్రీవాభిప్రాయమే, అంత కట్టుగా యెదిరిస్తారు. తరతరాలనుంచీ స్త్రీల హక్కులను అణగద్రొక్కి వారి ఆస్తిపాస్తులను అనుభవించడానికి అలవాటుపడ్డ వారికి, స్త్రీకిగూడా తమతోబాటు సమానవాటా యివ్వడమంటే యిష్టముంటుందా మరి?

1937-వ సంవత్సరంలో చేయబడిన హిందూస్త్రీల వారసత్వచట్టం ఎట్లాగో అవాంతరాలన్నీ గడిచి బయటపడి విగతభర్తృకలైన స్త్రీలకు కొమాళ్ళతోబాటు భాగం కల్పించింది. ఈ చట్టంవల్ల స్త్రీ భర్త చనిపోతే కొమాళ్లతోబాటు తానూ ఒకభాగం పంచుకోవచ్చు. తన యిష్టానుసారం అనుభవించవచ్చు. కొడుకులు చందాలు వేసుకొని మనువృత్తి యివ్వనక్కరలేదు. ఏకపుత్రుడే అయినా అతనితోగూడా స్త్రీ తనభాగం పంచుకోవచ్చును. ఈ శాసనం చేయబడటం నిజంగా స్త్రీల అదృష్టమనే చెప్పాలె. ఇట్టిచట్టం చేయ్యడానికి శాసనసభ్యులు యెంతో ఔదార్యంచూపించారని ఒప్పుకొనితీరాలె. కాని దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యలేదన్నట్టుగా భారతశాసనసభవారు దీనిని అంగీకరించినా; రాజప్రతినిధి దీనిని ఆమోదించినా, దీనికి అవాంతరం రానేవచ్చింది. 1935 సం|| ఇండియాచట్టంవల్ల కేంద్ర ప్రభుత్వానికి జెందిన కొన్ని అధికారాలు రాష్ట్రీయప్రభుత్వాల వశం చేయబడ్డవి. వానిలో వ్యవసాయభూముల హక్కు ఒకటి ఈవిధంగా సెంట్రలు ప్రభుత్వంనుండి రాష్ట్రీయ ప్రభుత్వానికి వచ్చింది. ఈ సంధిగ్ధసమయంలో చేయబడిన 1937-వ సం|| హిందూస్త్రీల వారసత్వపు చట్టంలోని ఆస్తిహక్కులు పరిశీలించే సమయంలో వ్యవసాయ భూములు రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి గదా, వీనిపై హక్కును కేంద్రప్రభుత్వం ఎట్లా చలాయిస్తుంది? పై వారసత్వ చట్టంవల్ల వ్యవసాయ భూములపై గూడా స్త్రీకి హక్కు గల్పించడానికి కేంద్ర ప్రభుత్వానికేమి అధికారం ఉన్నది? అనే ధర్మసందేహం వచ్చింది. ఈ సందేహం తీర్చడానికి భారత దేశ ప్రధాన న్యాయస్థానమైన ఫెడరలుకోర్టుకు పోయింది వివాదం. వారు సావకాశంగా విచారించి 1937-వ సంవత్సరంలో చేయబడిన హిందూస్త్రీల వారసత్వపు చట్టము న్యాయసమ్మతమైనదే అయినప్పటికీ రాష్ట్రపు ప్రభుత్వాలకు వశము చేయబడిన వ్యవసాయపు భూములకు వర్తింపజేయడానికి వీలులేదు కనుక వ్యవసాయపు భూములు మినహా తక్కిన ఆస్తిలోనే స్త్రీలు కొమాళ్ళతోబాటు భాగార్హులౌతారని తీర్పు చెప్పారు. న్యాయశాస్త్రరీత్యా ఈ తీర్పు న్యాయమైనదే కావచ్చునుగాని స్త్రీలకుమాత్రం ఈ తీర్పువల్ల చాలా అన్యాయం జరిగింది. ఈ హిందూదేశంలో ముఖ్యమైన ఆస్తి అంటే వ్యవసాయపు భూమే. ఆ భూమికే ఈచట్టం వర్తించకపోతే ఈ చట్టంవల్ల స్త్రీకి గగ్గే ప్రయోజనం లేదు. ఈచేత యిచ్చి ఆచేత తీసుకున్నట్టయింది. మామిడిపండులో గుజ్జు మినహా సర్వం అంటే పై తొక్క లోపలిటెంక దానంచేసినట్లయింది.

స్త్రీ లెల్లరు యీ అన్యాయం బాగా గమనించి గొప్ప ఆందోళనచేస్తేనే తప్ప ప్రభుత్వమువారి దృష్టికి యీ విషయం వచ్చి గవర్నరు జనరల్ యే ప్రత్యేకాధికారాలచేతనో ఈ లోపం సవరించడమో,

లేక రాష్ట్రీయ గవర్నమెంటులు ఈ శాసనం వ్యవసాయభూములకు వర్తించునట్లుగా చేయడమో ఏదో ఒకటి జరగదు. అఖిలభారత మహిళాసంఘము యీ విషయమై గట్టి ఆందోళనము చేస్తుందని నమ్మవచ్చును.

## రైళ్లలో స్త్రీల సౌకర్యాలు

స్త్రీలకు ప్రత్యేకంగా ఒక్క రైలుపెట్టె వేయడంతో స్త్రీలకు సమస్త సౌకర్యాలూ సమకూర్చినట్లుగా రైల్వే కంపెనీవారు భావిస్తూ ఉంటారు. కాని రైళ్లలో ప్రయాణంచేసే సమయంలో స్త్రీలు పడుతున్న యిబ్బందులెన్నో ఉన్నాయి. వానిలో స్త్రీల సమ్మర్దం యెంత యెక్కువగానున్నా ఒక్కటే రైలుపెట్టెమాత్రమే వేయడం మొదటి యిబ్బంది. ఇందువల్ల స్త్రీల పెట్టెలో ఒకొక్కప్పుడు గర్దీ ఒత్తిడివల్ల ప్రాణాలు పోతాయనిపిస్తూ ఉంటుంది. పసిబిడ్డలు గొల్లున గోలపెట్టుతుంటారు. ఎడపిల్లలంతకంటే గుండెలు పగిలేట్టు ఏడుస్తుంటారు. వీళ్లిద్దరినీ సమాధానపెట్టలేక తల్లికిగూడా దుఃఖం కంఠగతమౌతూ ఉంటుంది. రెండోది స్త్రీలపెట్టె యెక్కడనో అన్నిబండ్లకూ చివరను గార్డుపెట్టెకు ప్రక్కను వేయడం, స్త్రీల పెట్టె చివరగా ఉండటంవల్ల అది సాధారణంగా ప్లాటుఫారం దాటిఉండడం సంభవిస్తూ ఉంటుంది. అందువల్ల స్త్రీలు పసిబిడ్డలతో అంత యెత్తునుంచీ దిగడమూ, సామానులు వగైరాలు దించుకోడమూ ఎంతో కష్టమౌతూ ఉంటుంది. అంతేగాకుండా రైళ్లవద్ద అమ్మబడే చిరుతిండి పదార్థాలు మంచినీళ్లూ కాఫీ వగైరాలుగూడా చివరబండ్లదాకా రావు. సాధారణంగా అవి కావాలె, యివి కావాలె, అని మారాములు చేసే పిల్లలు తల్లులవద్దనే ఉంటారు. వాళ్ళ పెట్టెలవద్దకే పైవస్తువులు రాకపోవడం చాలా అసౌకర్యం అనడానికి సందేహంలేదు. ఈ రైళ్లుపెట్టె ఆఖరున ఉండటంవల్ల రైల్వే కూలీలుగూడా దగ్గిరదగ్గిర పెట్టెలను చూచుకుంటూ చివరకుగాని స్త్రీల పెట్టెవద్దకు రారు. ఈలోగా రైలు కదలడమో స్త్రీలు కాళ్లు దిగతొక్కుకుంటూ పిల్లలను గీగా అని యేడ్పించుకుంటూ సామానుదించుకోడమో తటస్థిస్తూ ఉంటుంది. పగటివేళనే స్త్రీలపెట్టె దూరంగా ఉండటంవల్ల యిన్ని యిబ్బందులున్నవి. ఇక రాత్రివేళనే అయితే యిందువల్ల స్త్రీలకు గలిగే కష్టమూ అపాయమూ గూడా చెప్పడానికి సాధ్యంకాదు. ఒకొక్కప్పుడు జనం విస్తారంగా లేని సమయంలో రాత్రివేళ చివరదాకా రాలేక జనులు సమీపంలో ఉండే పెట్టెలోనె యెక్కుతూ ఉండటమూ సంభవిస్తూ ఉంటుంది. అందువల్ల స్త్రీల పెట్టెకు ముందునఉండే మూడునాల్గు పెట్టెలు ఖాళీగానే ఉండటమూ, స్త్రీలపెట్టెలో ఒకరోయిద్దరో స్త్రీలు బిక్కుబిక్కుమంటూ ఉండటము, గార్డు ఒక్కడు మాత్రమే ఆపెట్టెకు రక్షకుడుగానో ఒకొక్కప్పుడు భక్షకుడుగానో అవుతూ ఉండటమూ సంభవిస్తూ ఉంటుంది. ఈ సందర్భాన స్త్రీలకు గలుగుతున్న అపాయములెన్నో మనము వింటూనే ఉన్నాము. కనుక ప్రత్యేక పెట్టెలో స్త్రీలకు గల్గుచున్న యీ యిబ్బందులన్నీ తొలగవలెనంటే స్త్రీలపెట్టె రైలుకుమధ్యగా ఒకే నిర్ణీత ప్రదేశంలో తగిలించడం చాలా అవసరం. అంతేగాకుండా స్త్రీజనం అధికంగా ఉన్నప్పుడు రెండోపెట్టెగూడా వేయడం ముఖ్యం. స్త్రీల పెట్టెలో సౌకర్యాలు యెక్కువగా ఉన్నట్లయితే స్త్రీలందరూ స్త్రీల పెట్టెలోనే కూర్చోడానికి అభిలషిస్తారు.

అంతేగాకుండా రైలుపెట్టెలన్నిటికీ పెద్దవిగా ఉన్నవానికి ఒకొక్కప్రక్కను రెండు[illegible] సాధారణంగా ఉంటున్నవి. అవి రెండూ ఎక్కడానికి దిగడానికి ఉపయోగించకుండా ఒకటి ఎక్కేదారిగాను ఒకటి దిగేదారిగాను నిర్ణయింపబడి ఉన్నట్లైతే రైలు బండ్లలో ప్రతి పెట్టెవద్దా ఎక్కేదిగే ప్రయాణీకులకు గలిగే త్రోపిడీ, సంఘర్షణా, జగడమూ, ఆలస్యము, సామానుల దెబ్బలు, అన్నీ తప్పిపోతాయి. మూడు నిముషాలు ఆగవలసిన బండి రెండు నిముషాలు మాత్రమే ఆగి పోవచ్చు. ఆంధ్రదేశరైలు ప్రయాణీక సంఘం వారు యీ విషయాలు ఆలోచిస్తే బాగా ఉంటుంది.